# కేసీఆర్‌కు అండగా నిలుద్దాం

- ముఖ్యమంత్రి కేసీఆర్ లేనిది తెలంగాణ లేదు
- చెడుపై విజయం సాధించడమే విజయదశమి
- ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- దసరా వేడుకల్లో పాల్గొన్న మంత్రి.. పెద్దఎత్తున హాజరైన ప్రజలు


రంగధాంపల్లిలో దసరా వేడుకల్లో పాల్గొని మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, అక్టోబర్ 24: 'తెలంగాణ పాలపిట్ట కేసీఆర్‌కు అండగా నిలుద్దాం.. కేసీఆర్ లేనిది తెలంగాణ లేదని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. దసరాను పురస్కరించుకొని సోమవారం సిద్దిపేట పట్టణంలోని 2వ వార్డు నర్సపురం, 3వ వార్డు రంగధాంపల్లి, సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లిలోని వివేకానంద యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా ఉత్సవాల్లో పాల్గొని హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాలపిట్టను ఎగరవేశారు. రావణ దహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు ప్రజలకు జంబిని పంచి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన ఉత్సాహం తీసుకురావాలని భగవంతున్ని వేడుకున్నట్లు తెలిపారు. గత దసరాకు అనుకున్నవిధంగా ఈ సంవత్సరం రైలును తెచ్చుకున్నామన్నారు. సిద్దిపేటకు ట్యాగ్ లైన్ అయిన జిల్లా ఏర్పాటు, గోదావరి జలాలు, రైలును తెచ్చుకున్నామన్నారు. దశాబ్ద కాలంగా నర్సపూర్ ఊర్లో దసరా ఉత్సవాల్లో పాల్గొంటున్నానని తెలిపారు. సిద్దిపేట దశాబ్దాల కలలను నిజం చేసుకున్నామని, రాబోయే రోజుల్లో సిద్దిపేట నుంచి తిరుపతి బెంగళూరుకు రైలు సౌకర్యం కల్పిస్తామన్నారు. దసరా రోజు పాలపిట్టను చూస్తే అంతా శుభమే జరుగుతుందన్నారు. పాలపిట్ట సాక్షిగా ప్రమాణం చేద్దాం మన పాలపిట్ట సీఎం కేసీఆర్‌కు అండగా నిలుద్దామని పిలుపునిచ్చారు. దేవాలయాలు, రిజర్వాయర్ల ఖిల్లాగా సిద్దిపేటను మార్చుకున్నామని చెప్పారు. వచ్చే బతుకమ్మ నాటికి సిద్దిపేట కోమటిచెరువు వద్ద ఆర్టిఫిషియల్ బీచ్, శిల్పారామం ప్రారంభించుకుంటామన్నారు. సిద్దిపేట విద్యా క్షేత్రంగా మారిందన్నారు. దసరా వేడుకల్లో పాల్గొన్న ప్రజలకు తంజీమ్ ఉల్ మజీద్ ఉచితంగా తాగునీటిని సరఫరా చేసి తెలంగాణ సంస్కృతిని చాటి చెప్పారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా ఆధ్యక్షుడు వంగ నాగిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి, అర్బన్‌మండల వైస్ ఎంపీపీ ఎల్లం, కౌన్సిలర్లు నాయిని చంద్రం, వంగ రేణుకాతిరుమల్‌రెడ్డి, ఎన్సాన్‌పల్లి సర్పంచ్ బీఆర్ గౌడ్, మాజీ కౌన్సిలర్ ఉమరాణీఐలయ్య, మాజీ సర్పంచ్ ముత్యాల కనకయ్య, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### పలు ఆలయల్లో మంత్రి పూజలు

దసరా పండును పురస్కరించుకోని మంత్రి హరీశ్‌రావు సిద్దిపేట పట్టణంలోని కోటి లింగాల ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని జంబి పూజ చేశారు. అనంతరం రూరల్ పోలీస్ స్టేషన్ చౌరస్తాలోని దాసాంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సిద్దిపేట రేణుకాఎల్లమ్మ దేవాలయంలో పూజలు చేశారు. పట్టణంలోని 15 వార్డు ఇమాంబాద్‌లో హిందువాహిని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గమాత నిమజ్జన కార్యక్రమంలో భాగంగా అమ్మవారిని దర్శించుకున్నారు. యువసేన యూత్ ఆధ్వర్యంలో అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో కౌన్సిలర్ పాతురి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పల్లె బాలకిషన్ గౌడ్ పాల్గొన్నారు.


సిద్దిపేట రేణుకాఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి హరీశ్‌రావు


రంగధాంపల్లిలో రావణ దహన కార్యక్రమంలో మంత్రి హరీశ్‌రావు


రంగదాంపల్లిలో పాలపిట్టను ఎగరవేస్తున్న మంత్రి హరీశ్‌రావు


కోటి లింగాల ఆలయంలో జమ్మి పూజ చేస్తున్న మంత్రి


ఎన్సాన్ పల్లిలో దసరా ఉత్సవాల్లో పాల్గొన్న ప్రజలు


నర్సపురంలో మంత్రి హరీశ్‌రావుకు జంబి ఇస్తున్న ప్రజలు

# ప్రభాకర్‌రెడ్డి గెలుపు ఖాయం


బీఆర్ఎస్‌లో చేరుతున్న మహేశ్‌కు కండువా కప్పుతున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, పక్కన జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి తదితరులు

దుబ్బాక, అక్టోబర్ 24: దుబ్బాకలో బీఆర్ఎస్ అభ్యర్థి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపు ఖాయమని దుబ్బాక జడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, పెద్దగుండవెల్లి సర్పంచ్ సద్ది రాజిరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం దుబ్బాక మండలం పెద్దగుండవెల్లిలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో బీజేపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొర్ల మహేశ్ బీఆర్ఎస్‌లో చేరారు. బీజేపీ గ్రామ కమిటీ అధ్యక్ష పదవికి రాజీనామ చేసిన మహేశ్ ఎంపీ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మహేశ్‌కు గులాబీ కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై, ఎంపీ ప్రభాకర్‌రెడ్డితోనే దుబ్బాక అభివృద్ధి సాధ్యమవుతుందనే నమ్మకంతో బీఆర్ఎస్‌లో చేరినట్లు మహేశ్ తెలిపారు. ఈ ఎన్నికల్లో కొత్త ప్రభాకర్‌రెడ్డికి భారీ మెజార్టీ అందించటమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. అనంతరం జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, సర్పంచ్ సద్ది రాజిరెడ్డి మాట్లాడుతూ.. దుబ్బాకలో కొత్త ప్రభాకర్‌రెడ్డి గెలుపు ఖాయమని, ఇక మెజార్టీ కోసమే పోటీ అన్నారు. ఉప ఎన్నికలో మోసపూరిత హామీలతో గెలిచిన రఘునందన్‌రావు ప్రజలను మోసగించాడని ఆరోపించారు. రఘునందన్‌కు పదవి దాహం తప్ప ప్రజల సమస్యలు పట్టవన్నారు. కార్యక్రమంలో పెద్దగుండవెల్లి బీఆర్ఎస్ నాయకులు, సంజీవ్‌రెడ్డి ఉన్నారు.

### మిరుదొడ్డిలో బీజేపీకి షాక్

మిరుదొడ్డి, అక్టోబర్ 24: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి పలువురు నేతలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బీజేపీ కిసాన్ మోర్చా ఉమ్మడి మెదక్ జిల్లా కన్వీనర్, మండల కేంద్రమైన మిరుదొడ్డి టౌన్‌కు చెందిన సత్తు రాజిరెడ్డి మంగళవారం ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించుకుంటే గ్రామాలు మరింత అభివృద్ధి సాధిస్తాయని తెలిపారు. సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువత విభాగం రాష్ట్ర నాయకుడు సోలిపేట సతీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# వైభవంగా దసరా

వేడుకల్లో పాల్గొన్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి


పోతారం గ్రామస్తులతో మెదక్ ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి మంజులత

దుబ్బాక, అక్టోబర్ 24: దసరాను పురస్కరించుకొని నియోజకవర్గంలో సోమవారం విజయదశమిని ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణలో అతిపెద్ద పండుగైన దసరాను చిన్నారుల నుంచి వృద్ధుల వరకు సంతోషంగా జరుపుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. విజయదశమి రోజున శుభంగా భావించే పాలపిట్టను దర్శించుకోవడంతోపాటు జమ్మిచెట్టుకు పూజలు చేశారు. నియోజకవర్గంలో దుబ్బాక, మిరుదొడ్డి, దౌల్తాబాద్, తొగుట, రాయపోల్, దౌల్తాబాద్ మండలాల్లో విజయదశమి వేడుకలను సంబురంగా జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుబ్బాకలో మారెమ్మ, ఎల్లమ్మ దేవాలయాల వద్ద ప్రత్యేక పూజలతోపాటు వాహనాలకు పూజలు నిర్వహించారు. పోలీసు స్టేషన్‌లలో పోలీసులు ఆయుధ పూజ నిర్వహించారు. పలు గ్రామాల్లో రావణాసుర దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బంధుమిత్రులను కలుసుకొని జమ్మి(బంగారం) ఇచ్చిపుచ్చుకొని దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. యువకులు రికార్డింగ్ పాటలపై నృత్యం చేశారు. మహిళలు బతుకమ్మ, దాండియా ఆట పాటలతో సంతోషంగా జరుపుకున్నారు.

### స్వగ్రామంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

మెదక్ ఎంపీ, బీఆర్ఎస్ దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి తమ స్వగ్రామమైన దుబ్బాక మండలం పోతారం గ్రామంలో గ్రామస్తులతో కలిసి దసరా వేడుకల్లో పాల్గొన్నారు. సాయంత్రం గ్రామస్తులతో కలిసి ఊరేగింపుగా వెళ్లి పాలపిట్టను దర్శించుకున్నారు. అనంతరం గ్రామస్తులకు ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆయన సతీమణి మంజులత జంబి పెట్టి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీ ప్రభాకర్‌రెడ్డికి దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నే వనితాభూంరెడ్డి, ఎంపీపీ కొత్త పుష్పలతాకిషన్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు దసరా శుభాకాంక్షలు తెలిపారు.